

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

24 నవంబర్ 2025 పేజీలు : 08


## మేయర్ మార్పుపై టీడీపీ కసరత్తు



**మేయర్ అవిశ్వాసంపై టీడీపీ గురి**

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతిని అవిశ్వాస తీర్మానం పెట్టి మార్చేందుకు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు సిద్ధమైనట్లు సమాచారం. నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి 2021 నవంబర్‌లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికై, మేయర్‌గా ఎన్నుకోబడ్డారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అనుచరుడైన మేయర్ భర్త జయ వర్ధన్‌కు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్రవంతికి మేయర్‌గా అవకాశం కల్పించారు. నగర పాలక సంస్థలో మేయర్ స్థానం ఎస్టీ రిజర్వేషన్ కావడంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పట్టుబట్టి మేయర్‌గా స్రవంతికి అందరిని ఒప్పించి అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల వల్ల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. దీంతో మేయర్ దంపతులు కూడా ఆయనకు మద్దతుగా తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతరం అధికార వైఎస్ఆర్‌సీపీ వల్ల మళ్ళీ మేయర్ దంపతులు వైసీపీలోకి వచ్చారు. అనంతరం వైసీపీకి -మిగతా 2లో



## ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్‌గా చేయడమే.. లక్ష్యం

- పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- త్వరితగతిన రోడ్ల నిర్మాణ పనులు
- అన్నిప్రధాన ఆలయాలలో దేవాలయాలు పునః నిర్మాణాలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం వెల్లడి

**రాపూరు, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర నవనిర్మాణ ప్రధాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించి నవ్యాంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్‌గా చేసేందుకు ప్రత్యేక దృష్టిసారించడం జరుగుతుందని రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు మంత్రి ఆదివారం పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని పెంచలకోనలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునః నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పెంచలకోనలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునః నిర్మాణంకు రూ. 6.5 కోట్ల నిధులు కేటాయించి భూమిపూజ చేయడం జరిగిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అదేవిధంగా పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి ఆలయ పునః నిర్మాణం కూడా చేయాలని స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ వినతి మేరకు ఆధిశగా నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి ఆనం వెల్లడించారు. రాష్ట్రంలోని అన్నిప్రధాన దేవాలయాల్లోని ఆలయాల పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా నిధులు మంజూరు చేయడం జరిగిందని ఇప్పటికే అనేకచోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ మధ్యకాలంలో జిల్లాలో అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్న మాట వాస్తవమేనని అందుకు అనుగుణంగా సీఎం చంద్రబాబు నాయుడు సంబంధిత -మిగతా 2లో

## సత్యసాయి బాబాకు నివాళులర్పించిన ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం నెల్లూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అజితా వేజండ్ల, ఇతర పోలీసు అధికారులు బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సత్యసాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా లక్షలాది ప్రజలకు ఉచిత వైద్య సహాయం, విద్య, తాగునీటి ప్రాజెక్టులు, సేవా కార్యక్రమాలు అందించడం విశేషమని తెలిపారు. అదేవిధంగా బాబా సేవ మార్గం అనుసరణీయమైనదని, ఆయన ఎల్లప్పుడూ సమాజ సంక్షేమం కోసం పనిచేశారని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అడి షనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఏఆర్డి ఎస్పీ చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





- రూ.1.39 కోట్లతో నగరంలోని పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తో కలిసి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరంలో ఏడు చోట్ల సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు
- సిగ్నల్స్‌లో ప్రజలు తూచా తప్పకుండా పాటించాలన్న మంత్రి, ఎంపీ వేమిరెడ్డి
- అక్రమ కట్టడాల తొలగింపునకు ఆక్రమణదారులు సహకరించాలన్న మంత్రి నారాయణ

## ట్రాఫిక్ సమస్యకు చెక్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

నెల్లూరులో ట్రాఫిక్ సమస్యకు ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్లతో చెక్ పడుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంత్రి ఆదేశాలతో రూ. 1.39 కోట్ల నిధులు వెచ్చించి నెల్లూరు నగరంలోని హరనాధపురం, రామలింగాపురం, వీఆర్సీ, కనకమహల్ సెంటర్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నుడా -మిగతా 2లో

# కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

- కోవూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తా..
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలి
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- సహకారంతో ఇనమడుగులో హాస్పిటల్ నిర్మాణానికి సిఎస్ఆర్ ఫండ్స్ అందచేసిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్
- ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య అందివ్వాలన్నది చంద్రబాబు నాయుడు తాపత్రయం.
- 18 నెలల కూటమి పాలనలో కోవూరు నియోజకవర్గంలో అనారోగ్య పీడితులకు దాదాపు 6 కోట్లు ఆర్థిక సహాయం అందించాం
- నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం అతి త్వరలోనే "యూనివర్సల్ హెల్త్ పాలసీ" విద్యా, వైద్యం రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తాను
- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "యూనివర్సల్ హెల్త్ పాలసీ" అనే విన్నూత్న పథకానికి శ్రీకారం చుట్టబోతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆమె శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సందర్భంగా శిథిలావస్థకు చేరిన ఇనమడుగు పిహెచ్‌సి గురించి స్థానిక నాయకులు తన దృష్టికి తెచ్చారని, తాను ఎమ్మెల్యే కాగానే నియోజకవర్గంలో ప్రజలకు వైద్య సదుపాయాల గురించి తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిని సందర్శించానన్నారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, ఎంపి ప్రత్యేక చొరవ తీసుకొని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వారి ద్వారా హాస్పిటల్ నిర్మాణానికి 1 కోటి 98 లక్షల సిఎస్ఆర్ ఫండ్స్ మంజూరు చేయించారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 24 గంటల డాక్టర్లు అందుబాటులో ఉండేలా జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని వేదికపై ఉన్న జిల్లా వైద్యాధికారికి ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య అందివ్వాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని, 18 నెలల కూటమి పాలనలో కోవూరు నియోజకవర్గంలో అనారోగ్య పీడితులకు దాదాపు 6 కోట్లు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా కృత జ్ఞతలు తెలియ చేశారు. కోవూరు నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం దిశగా తాను చేస్తున్న కృషిని ఆమె ప్రజలకు వివరించారు. విద్య, వైద్య రంగాలలో కోవూరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలన్నది తన సంకల్పమన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం అతి త్వరలోనే "యూనివర్సల్ హెల్త్‌పాలసీ" అనే పథకానికి చంద్రబాబు శ్రీకా రం చుట్టబోతున్నారని, దీని ద్వారా పేదలకు ఏడాదికి ఉచితంగా 25 లక్షల విలువ చేసే వైద్య సేవలు అందుబాటులోనికి రానున్నాయన్నారు. కోవూరు నియోజకవర్గంలో రైతులు సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఇప్పటికే రైతులకు 2 విడతలుగా యూరియా పంపిణి చేపట్టామని, 20 ఏళ్లుగా పూడికలు తీయని సాగునీటి కాలు వలలో తన హయాంలో సిల్ట్ క్లియరెన్స్ చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఉగాది నాటికి పేదల ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తా మని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, స్థానిక వైద్యాధికారి నిరంజన్, ఎంపీడీఓ శ్రీహరి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధా కర్ రెడ్డి, ఎంపీటీసీ కొల్లారెడ్డి సునీల్ రెడ్డి, వైస్ సర్పంచ్ చేజర్ల మహేష్, తెలుగుదేశం సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జెట్టి మదన్ రెడ్డి, నల్లపరెడ్డి సురేష్ రెడ్డి, స్థానిక నాయకులు తోట వెంకటేశ్వర్లు రెడ్డి చింతలపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య రక్షణకు మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు అభినందనీయం

- సీఎం చంద్రబాబు వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు
- యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా పేదలకు 25 లక్షల వరకు హెల్త్ బెనిఫిట్స్
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** కేవీఎస్ఆర్ (కూనం వెంకట సుబ్బారెడ్డి) ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూనం వెంకట సుబ్బారెడ్డి 14వ వర్ధంతి, వారి కుమారుడు అనిల్ రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా.. బద్దిపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుతో కలిసి ఉలవపాడు మండలం బద్దిపూడిలో కేవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. కూనం వెంకటసుబ్బారెడ్డి సతీమణి ఈశ్వరమ్మకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉపశమనం కలుగుతుందని చెప్పారు. గ్రామస్థుల ఆరోగ్య రక్షణకు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని, టిడిపి నాయకులు, సుబ్బారెడ్డి తనయుడు రాఘవ రెడ్డికి, బ్రహ్మానంద రెడ్డికి తన అభినందనలు తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి మెడికల్ క్యాంప్స్ అవసరమన్నారు. గ్రామస్థులు ఆరోగ్యం బాగా లేకున్నా అంతగా పట్టించుకోరని, ఆసుపత్రికి వెళ్లాలంటే ఆలోచిస్తుంటారన్నారు. కాబట్టి ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని చెక్ అప్ చేయించుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా సీఎం చంద్రబాబు గారు పనిచేస్తున్నారన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా పేదలకు 25 లక్షల వరకు హెల్త్ బెనిఫిట్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. దేశంలో మరే ఇతర రాష్ట్రం ఈ తరహా పాలసీని తీసుకురాలేదని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారని చెప్పారు. వైసీపీ నాయకులు కోటి సంతకాల పేరుతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, పీపీపీ విధానంపై అవగాహన లేదన్నారు. కాబట్టి ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు చేర్చేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి, వరంగల్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మేయర్ మార్పుపై టీడీపీ కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

మేయర్ స్రవంతి దూరంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలకు వెళ్లకుండా ఉన్నారు. దీంతో మేయర్ స్రవంతి నగరపాలక సంస్థలో జరిగే కార్యక్రమాల్లో ఒంటరిగానే పాల్గొంటూ వచ్చారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో మాత్రం దూరంగా ఉంటూ తటస్థంగా ఉండిపోయారు. అయితే ఇటీవల జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి జైలు నుంచి విడుదలై రావడంతో ఆయన్ను మేయర్ స్రవంతి దంపతులు కలవడం జరిగింది. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు స్రవంతిని మార్చాలని పట్టుపడ్డారు. అయితే నాలుగు సంవత్సరాలు కాకుండా మేయర్ మార్పు చేయకూడదని నిబంధన ఉండడంతో వారు అప్పటి నుంచి పావులు కదుపుతూ వచ్చారు. ఈనెల 22వ తేదీకి మేయర్ స్రవంతి బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో దీనిపై పార్టీలో చర్చ సాగి మేయర్ స్రవంతిని ఎలాగైనా మార్చాలని ఒక తీర్మానానికి వచ్చినట్లు సమాచారం. దీనిపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కలిసి గతంలో చర్చించుకోగా, మళ్లీ ఇప్పుడు నాలుగు సంవత్సరాలు పూర్తయినందున మేయర్ స్రవంతి మార్పుపై మొగ్గు చూపినట్లు సమాచారం. మేయర్ స్రవంతి మార్పుపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఆదివారం చర్చించుకున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థలో 54 మంది కార్పొరేటర్లు ఉండగా వారిలో 43 మంది వరకు తెలుగు దేశం పార్టీకి చెందినవారే ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారు కూడా మేయర్ మార్పుపై పట్టుపడుతున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ మేయర్‌గా పొట్లూరి స్రవంతిని అవిశ్వాసం పెట్టి మారిస్తే తెలుగుదేశం పార్టీకి చెందిన 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాతకు మేయర్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది. ఇప్పటికే టీడీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ అగ్ర నాయకుల సూచనల మేరకు మేయర్ స్రవంతి అవిశ్వాసానికి రంగం సిద్ధం చేశారు. సోమవారం కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌ను కలవనున్నారని సమాచారం. మొత్తం మీద నగరపాలక సంస్థలో మేయర్ స్రవంతి మార్పుపై జోరుగా చర్చ సాగుతుంది.

# ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్‌గా చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశా లు ఇచ్చి అవసరమైన నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందని మంత్రి ఆనం వెల్ల డించారు. త్వరితగతిన దెబ్బతి న్న రహదారుల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మంత్రి ఆనం చెప్పారు. జిల్లాలో దేవాదా యశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దేవాలయాల పునర్నిర్మాణ కార్యక్రమా లు జరుగుతున్నాయని క్షేత్రాన్ని మరింత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అందరి సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించి గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపా యాలను కల్పించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర దేవాదా య శాఖ మంత్రి రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. వెంకటగిరి నియోజ కవర్గం పరిధిలో వెంకటగిరి ప్రాంతంలో పోలేరమ్మ ధ్యాన మందిరం నిర్మాణానికి నిధులు మంజూరు బాలాయపల్లి మండలంలోని యాచవరం గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి, రాపూరు మండలంలోని పెంచలకోన పుణ్యక్షేత్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిం దని మంత్రి ఆనం తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చెన్ను అశోక రెడ్డి, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

# జడ్పీలో సత్యసాయి బాబా శతజయంతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి సత్యసాయి బాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. బాబా సేవలను జిల్లా ప్రజా పరిషత్ ఉద్యోగులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బ్యాంకును వెంటనే ఏర్పాటు చేయాలి

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పరిధిలోని 53, 54 డివిజన్ల పరిధిలో ప్రభుత్వ బ్యాంకును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) 53, 54 డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం సెంటర్‌లో స్థానిక ప్రజలతో భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున స్థానిక మహిళలు ధర్నా శిబిరానికి తరలివచ్చారు.స్థానిక ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నాకు 53వ డివిజన్ శాఖ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ మాట్లాడుతూ.. 53, 54 డివిజన్ల పరిధిలో కెనరా బ్యాంకు ను స్థానిక ప్రజలు కలిసి అభివృద్ధి చేసుకున్నా 53, 54 డివిజన్ల పరిధిలో వున్న కెనరా బ్యాంకును స్థానిక ప్రజలు కలిసి అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. స్థానికులకు, ఖాతాదారులకు తెలియకుండా గత నాలుగేళ్ల క్రితం అన్యాయంగా నవాబుపేటకు వెంకటేశ్వరపురంలో ఉన్న కెనరా బ్యాంక్‌ని తరలించారని అన్నారు. స్థానికంగా బ్యాంకు లేకపోవడంతో రోజువారి బ్యాంకు లావాదేవీల కోసం నెల్లూరు నగరానికి వెళ్లి వచ్చేందుకు ఒక్కసారికి 80 రూపాయల నుండి 100 రూపాయల



వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు. 53, 54 డివిజన్ల పరిధిలో లక్ష మందికి పైగా ప్రజలు నివాసముంటున్న బ్యాంకు లేకపోవడం విచారకరమన్నారు. బ్యాంకు ఏర్పాటు చేయాలని పలు దఫాలు అధికారులకు, పాలకులకు విన్నవించుకున్న సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. తక్షణమే వెంకటేశ్వరపురంలో ప్రభుత్వ బ్యాంకును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఏర్పాటు చేసేంతవరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, కాయంబు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి శతజయంతి భక్తిస్ఫూర్తి

## సాలిపేటలో సేవ, సంకీర్తనల సాహితీ మహోత్సవం



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** శ్రీసత్యసాయి బాబా శతజయంతి భావోద్వేగంతో సాలిపేట సెంటర్ శనివారం భక్తిరసమయంగా మారిపోయింది. ఈదూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి స్ఫూర్తిగా, గ్రామస్థుల భాగస్వామ్యంతో ప్రేమ, సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదానంతో సేవామార్గం ప్రతిఫలనం సత్తువ ఉన్న భక్తి భావానికి ప్రతీకగా, గ్రామంలోని వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు సహా పెద్ద సంఖ్యలో పాల్గొన్న అందరికీ రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. భక్తులు పరస్పర ప్రేమతో సేవలో తలమునకలయ్యారు. భజనలతో సాలిపేట సెంటర్ భక్తిమయం సాయి నామసంకీర్తనలతో, సాయి గానాల స్వరాలతో సెంటర్ మొత్తం ఆధ్యాత్మిక ప్రకాశంతో నిండింది. భక్తులు చేతులెత్తి శాంతి, సద్విలాసం, సాయి ఆశీర్వాదం కోసం ప్రార్థనలు చేశారు. సేవ అనేది సాయిబాబా చూపించిన మార్గం అని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. 'సేవ చేసే అవకాశం దొరకడం ఆనందం. సాయిబాబా ఆశయాలను గ్రామస్థాయిలో విస్తరించడం మా అదృష్టం' అని సుధాకర్‌రెడ్డి భావోద్వేగంతో తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం శతజయంతి సందర్భంగా కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ.. 'సాయిబాబా సేవా భావాన్ని అందరికీ చేరుస్తూ చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో శోభనీయంగా ఉంది. సుధాకర్ రెడ్డి సేవలు ప్రేరణనిస్తాయి' అని పేర్కొన్నారు. ఈ మహోత్సవం ద్వారా సత్య సాయి ప్రేమ, శాంతి, సేవా సందేశాలు సాలిపేట గ్రామంలో మరోసారి వెలుగులోకి వచ్చాయి.

# పరీక్షల విజేతలకు బహుమతులు అందజేత : డీఎస్పీ

**కావలి, మేజర్‌న్యూస్ :** ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విజేతలైన వారికి కేంద్ర ప్రభుత్వ పాఠశాల లోని నిరుపేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించుటకు ఎన్ఎంఎంఎస్ నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్షిప్ ప్రవేశపెట్టిన సందర్భంగా డిసెంబర్ 7వ తేదీ జాతీయస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జరగబోవు ఎన్ఎంఎంఎస్ పరీక్షలు రత్తమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో రత్తమ్మ పేరుమీద కావలిలో నిర్వహించిన నమూనా పరీక్షల్లో విజేతలకు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ చేతుల మీదుగా మొదటి బహుమతి జోష్ణ రెండో బహుమతి ఏ.నాగచైతన్య మూడవ బహుమతికి ఆదిత్య శేఖర్, నాలుగో బహుమతి ఎస్కే సమీర్, కన్సిలేషన్ ప్రైస్‌లు 6 మందికి అందించడం జరిగింది. అలాగే ప్రసాద్ రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్లో జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ ఉత్తమ స్థాయిలో ప్రతిభలో సాధించాలని సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం 9వ తరగతి నుండి సీనియర్ ఎన్టీఆర్ వరకు నాలుగు సంవత్సరంలో వరకు నెలకు 12వేల రూపాయలు చొప్పున 48 రూపాయలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎనిమిదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తగు సూచనలు సలహాలు



అందించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలుగు తీసేందుకు మేధాశక్తిని పెంపొందించుటకు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే మంచి కార్యక్రమం చేస్తూ వారికి వచ్చే పెన్షన్ లోనే కొంత ధనాన్ని ఉపయోగించి ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చి వాళ్ళ ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి రమణయ్య, రాయపాటి దిలీప్ కుమార్, గని, బాష, లోక్‌సత్తా మాలకొండ రెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కావలి ఐఎంఏకి ఉత్తమ సేవా అవార్డులు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సాంవత్సరిక కాన్ఫరెన్‌లో కావలి ఐఎంఏ శాఖకు రెండు ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. ఇటీవల అన్నమయ్య జిల్లా రాజంపేటలో జరిగిన ఐఎంఏ రాష్ట్ర సాంవత్సరిక వేడుకల్లో ఈ అవార్డులను కావలి ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కే.సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ గోపికృష్ణ, కోశాధికారి డాక్టర్ పి.శివప్రసాద్‌లు జాతీయ ఐఎంఏ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు, సెక్రట రీల చేతులమీదుగాఅందుకోవడం జరిగింది. మొదటి అవార్డు 'బెస్ట్ సోషల్ యాక్టివిటీ' క్రింద



ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కే.సుబ్బారావు అందుకోగా, ఉత్తమ కార్యదర్శి అవార్డును డాక్టర్ గోపికృష్ణ అందుకోవడం జరిగింది. కావలి ఐఎంఏ ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన గర్భకోశ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లకు ఉచితంగా ప్రజలకు పరీక్షలు జరిపే క్యాంపులు నిర్వహించారు. ఇవికాక మరెన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందున ఈ అవార్డులు కావలి ఐఎంఏకి లభించాయి. ఈ సందర్భంగా కావలి ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కే.సుబ్బారావు మాట్లాడుతూ.. కావలిలో ఐఎంఏ సభ్యులు, ఇతర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, స్థానిక సామాజిక సేవకుల సహకారంతోనే, తాము ఈ ఘన విజయాన్ని సాధించగలిగినట్లు, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందే

- కండలేరు డ్యాంలో 33 మందికి బదులు ముగ్గురితో నిర్వహణ
- బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ విడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని ఉన్నత ధర్మసనం తీర్పు శుభ పరిణామంగా బీజేపీ నేత మిడతల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ భూములను తల్లిగా భావిస్తారు. తెలుగు గంగ ప్రాజెక్టు కోసం భూములు తీసుకునేటప్పుడు ఇంటికొక ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. సాంకేతిక కారణాలు అడ్డుపెట్టి ఉద్యోగాలు ఇవ్వకుంటే నిరుద్యోగుల అశాంతికి దారితీస్తుందని ధర్మాసనం పేర్కొంది. తెలుగు గంగలో కడప వారితోపాటు నెల్లూరు జిల్లా నిరుద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రెండు కేసులలోనూ జీవో నెంబర్ 98 ప్రకారం ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని ధర్మసనం స్పష్టం చేసింది. కండలేరు జలాశయం సాధారణ నిర్వహణ కొరకు 33మంది సిబ్బంది అవసరం కాక కేవలం ముగ్గురితో మాత్రమే ధ్యానం కండలేరు జలాశయం సాధారణ నిర్వహణ కొరకు 33 మంది సిబ్బంది అవసరం కాక కేవలం ముగ్గురితో మాత్రమే డ్యామ్ నిర్వహిస్తున్నారు. ధర్మాసనం తీర్పును గౌరవించి నెల్లూరు జిల్లాలో కూడా తక్షణమే ఉద్యోగాలు భర్తీ చేయాలని మిడతల రమేష్ డిమాండ్ చేశారు.

## వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం శంకవరం పంచాయతీలోని వెంకటాద్రి పాలెం గ్రామంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకూడదని వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఘనంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు లెక్కల సుధాకర్ రెడ్డి పొడమేకల అదేయ్య నాగయ్య వెంకటపతి ఓర్సు యానదయ్య బత్తుల రామాంజనేయులు గోసు సీనయ్య వెంకటేశ్వర్లు బోనం కొండయ్య తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

## బూదవాడలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని జాతీయ రహదారి-565పై బూదవాడ గ్రామం సమీపంలో జరిగిన హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మర్రిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాద స్థలంలో మృతుడి వద్ద ఏవిధమైన వ్యక్తిగత వస్తువులు లేదా గుర్తింపు వివరాలు లభించకపోవడంతో పోలీసులు ఆయనను గుర్తించడానికి ప్రజల సహాయం కోరుతున్నారు. మృతుడి వయస్సు సుమారు 30 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండి, ఎత్తు 5 అడుగులు 8 అంగుళాలు, శరీర నిర్మాణం మధ్యస్థగా ఉండే వ్యక్తి. ప్రమాద సమయంలో ఆయన నేవీ బ్లూ రంగులో రిబాక్ కంపెనీ షార్ట్ ధరించి ఉన్నట్లు సమాచారం. అలాగే కుడి చేతి పైభాగంలో నల్ల టాటూ గుర్తు, ఎడమ చేతి ముందుభాగంలో స్వీయగాయాల మచ్చలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఐపీసీ సెక్షన్ 304(ఏ) (నిర్లక్ష్యంగా వ్యవహరించి మరణానికి కారణం కావడం) కింద కేసు నమోదు చేసి మర్రిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సాక్షులుగా ఉన్నవారు, డాష్‌క్యామ్ ఫుటేజ్ కలిగినవారు లేదా వాహనం వివరాలు తెలిసినవారు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.









## పెంచలకోనలో అభివృద్ధి పనులకు

# మంత్రి ఆనం శంకుస్థాపన



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన పెంచలకోనలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి శంకుస్థాపన పెంచలకోనలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిమిత్తం విచ్చేసిన మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలకు మండల తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఆలయ ఈఓ అండ్ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి, రాపూరు పీఏసీయస్ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, పచ్చిగళ్ల రత్నయ్య, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ముందుగా మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల తదితరులు శ్రీ ఆదిలక్ష్మి అమ్మ వారి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన హొమంలో పాల్గొని శ్రీవారు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆప్రాంతంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణంకు స్థానిక ఎమ్మెల్యే కురుగోడ్ల రామకృష్ణతో కలసి భూమిపూజ చేసి శంకుస్థాపన కార్యక్రమంను చేశారు. ఆ తర్వాత శ్రీ పెనుశిల లక్ష్మి నృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిదంగా శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి, శ్రీ ఆంజినేయస్వామి వారికి మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగోడ్ల ఇరువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ స్వామివారి దర్శనంకు విచ్చేసిన మంత్రి ఆనంకు దేవస్థానం ప్రధాన అర్చకులు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అభివృద్ధి పనుల శిలాపకంను ఆవిష్కరించారు. దేవస్థానంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునః నిర్మాణంను దేవాదాయ శాఖ సీజేఎఫ్ నుండి రూ.4.33.33, దేవాదాయ శాఖ మిగులు నిధులు 2.16.67, మొత్తం రూ.6.50కోట్ల నిధులతో చేపట్టానున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు చెన్ను భాస్కర్ రెడ్డి, అకిలవలస సర్పంచ్ చెన్ను పెంచలరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ్ చౌదరి, రాపూరు కూటమి నాయకులు మారంరెడ్డి మధుసూదన్ రెడ్డి, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు రవాణామ్మ, మాజీ ఎంపీపీలు సూర్యప్రకాష్ యాదవ్, కనగాల పెంచలయ్య, దేవస్థానం మాజీ డైరెక్టర్ సోమయ్య యాదవ్, కూనిపోగు కన్నయ్య, పఠాన్ చాన్ బాషా, మండల ఎస్సీ టీడీపీ ఉపాధ్యక్షులు చింతగుంట రాజా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











# వైసీపీ విమర్శలకు ఘాటైన సమాధానం ఇవ్వాలి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసే ప్రతి విమర్శకు ఘాటైన సమాధానం చెప్పాలని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ పార్టీ నాయకత్వానికి సూచించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి నియామకాన్ని ఇదివరకే ప్రకటించి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన పదవులకు ఆయన ఆదేశాల మేరకు మీడియాకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. వావిలజనార్ధన్ (ఉపాధ్యక్షుడు) కోట చంద్రశేఖర్ రెడ్డి, గుండాల శ్రీనివాసులు రెడ్డి, వావిలవెంకట రమణయ్య (ఆర్గనైజింగ్ సెక్రటరీలు) శివయ్య, మురళీ, లక్ష్మీప్రసాద్ (కార్యదర్శులు) దువ్వూరు అనీల్ (కోశాధికారి) నియామకం అయినట్లు మండల పార్టీ అధ్యక్షుడు నీలం పేర్కొన్నారు. కమిటీ కార్యవర్గానికి ఆయన సాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ అధ్యక్షులు నీలం మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి చేస్తున్న రాజకీయ విమర్శలు అసహ్యంగా ఉన్నాయని ఆయన అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై మాజీ మంత్రి కాకాణిచేసిన విమర్శలు చూస్తుంటే రాజకీయాలు దిగజారిపోతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పద్ధతిగా మాట్లాడాలని పార్టీ అధ్యక్షుడు నీలం సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, సర్వేపల్లి నియోజకవర్గం తెలుగు యువత కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి దండు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, పైనపురం సర్పంచ్ విజయ్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొదలకూరు తాలూకా ఎన్‌జీవో ఎన్నికలు ఏకగ్రీవం



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ పొదలకూరు తాలూకా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. పొదలకూరు ఇరిగేషన్ కార్యాలయం ఆవరణంలో ఆదివారం జరిగిన నామినేషన్ ప్రక్రియలో 11 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒక్కకరి చొప్పున 11మంది మాత్రమే నామినేషన్లు వేయడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికల అధికారిగా రాపూరు తాలూకా అధ్యక్షుడు తోట మల్లిఖార్జున రావు, సహాయ ఎన్నికల అధికారిగా నల్లగండ్ల మధు, ఎన్నికల పరిశీలకులుగా ఈదూరు విజయ్ కుమార్ వ్యవహరించారు. పొదలకూరు తాలూకా ఎన్‌జీవో అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా కె.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా షేక్ షాన్ వాజ్, బి.రాజమోహన్, యం వెంగయ్యలు ఎంపికయ్యారు. కార్యదర్శిగా నేలపాటి చిరంజీవులు, సంయుక్త కార్యదర్శులుగా ఏ.రవీంద్ర బాబు, ఎస్ వినోద్ కుమార్, జె.మాధవ రావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా యం రాధా కుమారి, కోశాధికారిగా కె.కామాక్షిలు ఏకగ్రీవమయ్యారు. నూతన కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలియజేశారు.

# అభయాంజనేయస్వామి చైర్మన్ ప్రమాణస్వీకారం

▸ అతిథిగా మంత్రి ఆనం ▸ నాయకులు, భక్తులతో కళకళలాడిన ఆలయం






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణశివార్లలో నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై బైపాస్‌రోడ్డు వద్ద వెలసియున్న శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం, ఆలయం శాశ్వతధర్మకర్తగా, కార్య నిర్వాహక చైర్మెన్‌గా నియోజకవర్గంలోని ఏఎస్‌పేట మండలం చిరమనకు చెందిన తెలుగుదేశం నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి నియమితులై ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర దేవాదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. వేదపండితుల, అర్చకుల పూర్ణకుంభ స్వాగతం, మంత్రోచ్ఛారణల మధ్య ఈకార్యక్రమం అత్యంత కోలాహలంగా ఘనంగా జరిగింది. మంత్రి ఆనం ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. జిల్లా దేవాదాయశాఖా కమీషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి రవీంద్రారెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు. రవీంద్రారెడ్డి చైర్మెన్‌గా శ్రీఅభయాంజనేయస్వామి సాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు. నూతన చైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసిన కాటంరెడ్డి రవీంద్రారెడ్డిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పలువురు తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అర్చకులు రవీంద్రారెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. దైవసాక్షిగా ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, సంగం, చేజర్ల, అనంతసాగరం తదితర మండలాలనుండి విచ్చేసిన టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు కాటంరెడ్డిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, తెలుగుదేశం సీనియర్ నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, వైస్‌చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి, నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయభాస్కర్‌రెడ్డి, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, సొసైటీల అధ్యక్షులు కాటంరెడ్డి నారశింహారెడ్డి, పరిటాల సత్యనారాయణ, యర్రమల్ల చిన్నారెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, ఆత్మకూరు పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, కార్పోరేషన్ డైరెక్టర్ అబ్బూరు రమేష్‌నాయుడు, వివిదస్థాయిల్లోని తెలుగుదేశం నాయకులు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, మద్దినేని నారాయణ, కొప్పోలు చిన్నపురెడ్డి, షేక్ జిలానిబాషా, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య, ఏలూరు మాల్యాద్రినాయుడు, నారాయణనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ గౌస్‌బాషా, మాదాల శ్రీనివాసులునాయుడు, మొలబంటి రాజశేఖర్, మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, గంధళ్ళ వేణు, కొప్పోలు రమాదేవి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో..

# శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని తహసిల్దార్ కార్యాలయం నందు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ పుట్టినరోజు సందర్భంగా మండల రెవెన్యూ సిబ్బంది, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలేసి ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీఆర్వో హజరత్ మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి బాబా చేసిన సేవల గురించి కొనొయాడారు. ప్రజలు ఆయన బోధలను గుర్తు చేసుకుంటూ ప్రేమ సేవా సత్యం అనే ఆయన సిద్ధాంతాలను గుర్తు చేసుకుంటూ మండల తహసిల్దార్ కార్యాలయంలో నివాళలర్పించడం జరిగిందని తెలియజేశారు.

# నూతన గృహ మంజూరుకై దరఖాస్తు చేసుకోండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలో ఇల్లు లేని నిరుపేదలు తన గృహ మంజూరుకై దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుపేదలకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం సచివాలయాల అధికారులు డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఈ దరఖాస్తు ప్రక్రియను చేపట్టవచ్చని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50లక్షల రూపాయలను అందిస్తుందని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదని లక్ష్యంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాలు ప్రజలు తమకు ఇల్లు లేదని బాధపడకూడదని ప్రతి ఒక్కరికి అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన తెలిపారు. అన్నారు ఇల్లు లేని నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని తన సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని ఆయన కోరారు.

# ఎమ్మెల్యే కాకర్ల ఆదేశాలతో జంగిల్ క్లియరెన్స్

▸ పనులను పర్యవేక్షించిన మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో వింజమూరు పట్టణంలోని బంగ్లా సెంటర్ నుండి ఇరిగేషన్ కార్యాలయం వరకు ఇరిగేషన్ స్థలంలో నిండి ఉన్న కర తుమ్మ చెట్లను ఆదివారం జేసీబీ సాయంతో తొలగించారు. జరుగుతున్న పనులను మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పర్యవేక్షించారు. ఇరిగేషన్, రెవిన్యూ, అగ్రికల్చర్, కార్యాలయాలకు ఎదురుగా, జంగిల్ క్లియరెన్స్‌తో నిండిపోయి ఉండడంతో అక్కడ వ్యర్ధాలు వేస్తున్నారు. దీంతో చెడువాసన వెదజల్లుతూ, అధికారులకు, ప్రజలకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా అక్కడ అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇక్కడ ఉన్న చెట్లను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాల మేరకు చెట్లను తొలగించారు. ఈ ప్రాంగణంలో పార్కును ఏర్పాటు చేసి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతోపాటు, ఈ ప్రాంతాన్ని సుందరంగా రూపుదిద్దేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. అందులో భాగంగా జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంజీవ రాయుడు, ఏగినేని శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

# పెట్రోల్‌బంకును ప్రారంభించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం గాంధీజనసంఘం వద్ద నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. నూతన పెట్రోల్‌బంకును సక్రమంగా నిర్వహించాలని, అందరికి సేవాభావంతో సేవలందించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలో పడమటిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, పెట్రోల్‌బంకు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# పురాతన ఆలయాలకు కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం



- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ
- నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఆలయంలో భూమిపూజ చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ
- రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం : మంత్రులు, ఎంపీ
- నాలుగు దేవాలయాల అభివృద్ధికి రూ.23.95 కోట్లు కేటాయించిన మంత్రి ఆనంకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలో భక్తుల కొంగుబంగారమై విధాజిల్లుతున్న శ్రీ వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయ రూపురేఖలు మారనున్నాయని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఆలయంలో రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలతోపాటు అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ భూమి పూజ చేశారు. శ్రీ వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మూడంతస్థుల రాజగోపురం, మహామండపం, అర్చక స్వామి నివాసం, కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ముందుగా మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో అర్చకులు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పేరంటాళ్ళమ్మను దర్శించి మంత్రులు, ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు నగరం రంగనాయకుల పేటలోని శ్రీ వెంకటమ్మ పేరంటాళ్ళమ్మ ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కామన్ గుడ్ ఫండ్స్ ద్వారా ఆలయ అభివృద్ధి కోసం రూ.1.15కోట్ల రూపాయలు కేటాయించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నిధులతో మూడంతస్థుల రాజగోపురం, మహామండపం, అర్చక స్వామి నివాసం, కార్యాలయ నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. 300 సంవత్సరాల పూర్వం ఉదయగిరి నవాబులు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. వైద్యురాలిగా ప్రసిద్ధిగాంచి దేవతగా కొలవబడుతున్న పేరంటాళ్ళమ్మ తల్లికి మహిమాన్విత శక్తులున్నాయని భక్తుల ప్రఘాడ విశ్వాసం అని చెప్పారు. ఉదయగిరి నవాబుకి రాచకురుపు నయం చేసిన దేవతగా పూజింప పడ్డారన్నారు. ఈ ఆలయంలో అమ్మవారిని దర్శించి మొక్కుకొంటే ఎలాంటి జబ్బయినా చిటికెలో నయం అయిపోతుందన్నది అందరి నమ్మకం అని మంత్రి తెలిపారు. ప్రాముఖ్యత ఉన్న ఈ ఆలయ అభివృద్ధి పనుల్లో మేము కూడా భాగస్వాములం కావడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సిటీ నియోజకవర్గంలో నాలుగు దేవాలయాల్లో అభివృద్ధి పనులకు రూ.23.95 కోట్లు కేటాయించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ వెంకటమ్మ పేరంటాళ్ళమ్మ ఆలయం పురాతనమైనదన్నారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో ఈ ఆలయానికి వస్తుంటారని తెలిపారు. ఈ ఆలయం వెనుక భాగంలోనే తాను నివాసం ఉంటానన్నారు. మహిళా భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేస్తామని మాటిచ్చారు. దేవదాయశాఖ ప్రక్షాళన బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించారన్నారు. ఈ ప్రాంతంలో రామాలయ పునర్నిర్మాణ పనులకు త్వరలో శ్రీకారం చుడతామని తెలిపారు. రంగనాయకులపేటలో సత్రం స్థలం ఆక్రమణకు గురైందన్నారు. అన్యాక్రాంతమైన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని పార్కు రోడ్డుకు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని ఆలయాలను ప్రక్షాళన చేసి పున: నిర్మిస్తామన్నారు. నెల్లూరు నగరానికి అందరి సహకారంతో ఆధ్యాత్మిక శోభ తెస్తామని చెప్పారు. దేవాదాయశాఖ అందరి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. 5వేల పైచిలుకు గుడులకు ధూపదీప నైవేద్యాల కోసం పదివేల రూపాయలు సీఎం చంద్రబాబు కేటాయించారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మంత్రి నారాయణ అభివృద్ధికి మరో పేరుగా నిలిచారన్నారు. నెల్లూరుకు ఇద్దరు సమర్ధవంతమైన మంత్రులు ఉండటం మన అదృష్టం అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్‌తోపాటు టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడేళ్లలో 17లక్షల ఇల్లు కట్టాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణ రెడ్డి

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన గ్రామస్థాయిలో బలోపేతం చేయుటకు మండల అధ్యక్షులు ప్రశిక్షణ తరగతులు తోటపల్లి గూడూరు టీఎంఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగుతుందని తెలియజేశారు. అనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, రాబోయే మూడు సంవత్సరాల్లో 17లక్షల ఇల్లు కట్టాలని ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సామూహిక గృహప్రవేశాలు జరుపుతామని, అమరావతిలో క్వాంటం కంప్యూటర్స్ తయారీకి శ్రీకారం చుడుతున్నామన్నారు. అలాగే క్యాపిటల్ నిర్మాణం చేపడుతున్నట్టు కుప్పంను కరువు



రహిత ప్రాంతంగా భువనేశ్వరి ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు మహిళలకు ఉచిత బస్సు కల్పించడం, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది పిల్లలకు ప్రభుత్వం స్కాలర్షిప్, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను రిలీజ్ చేయడం, ప్రతి నెల ఒకటో తేదీ కల్లా ఉద్యోగస్తులకు జీతం పెన్షన్ దారులకు 4వేల రూపాయలు అందించడం జరుగుతుందని, జిల్లాలో కొత్త రైల్వే లైనులు రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ హయాంలోనే ఎస్సీలు అభివృద్ధి



## మండల టీడీపీ తలఅధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే ఎస్సీలు అభివృద్ధి చెందారని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ అన్నారు. ఆదివారం ముత్తుకూరు మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నూతన అనుబంధ ఎస్సీ కమిటీ కార్యవర్గాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు మీడియాకు ప్రకటించారు. పార్టీ జనరల్ సెక్రెటరీ మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగానన్నం దీనయ్యను ప్రకటించారు. పట్టపు శోభన్ బాబు, ధారా యాదగిరి (ఉపాధ్యక్షులు) కల్తూరి రవి(జనరల్ సెక్రెటరి) రొయ్యల రాంబాబు, దారా చిన్న నరసింహ (ఆర్గనైజింగ్ సెక్రటరీలు) పేరం ప్రకాష్, బల్లెం సుజన్ కుమార్, తాటిపర్తి సుబ్రమణ్యం (కార్యదర్శులు) నియామకం కావడం జరిగింది. నూతన ఎస్సీ సెల్ కమిటీని మండల పార్టీ నాయకత్వం ఘనంగా సన్మానించింది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆశయాలకు అనుగుణంగా కమిటీ కార్యవర్గం పనిచేయాలని పార్టీ అధ్యక్షుడు నీలం సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏడుకొండలు, శ్రీనివాస్ యాదవ్, ముత్యం గౌడ్, దండు శ్రీనివాసులు, శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యకు చెక్

*(మొదటి పేజీ తరువాయి)*

చైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, ఎస్పీ అజితా వేజెండ్లలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నగరంలో 7చోట్ల సిగ్నంగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈక్రమంలో 4చోట్ల లాంఛనంగా ప్రారంభించినట్లు తెలియజేశారు. నెల్లూరులో వరద ముంపునకు కాలువలపై అక్రమణలే కారణమని, అందువల్లే 2019లో సగం నగరం నీట మునిగిందని గుర్తు చేశారు. అప్పటి సీఎం చంద్రబాబు ఇక్కడే బస చేసి సహాయ చర్యలు చేయించారన్నారు. పూడికతీత పనుల వల్ల గత నెలలో తుఫాన్ ముప్పును తప్పించగగామని చెప్పారు. కాలువలు వెడల్పు చేస్తే తప్ప పూర్తి స్థాయిలో ముంపును నివారించలేమన్నారు. అక్రమ కట్టడాల తొలగింపునకు ఆక్రమణ దారులు సహకరించాలని తెలియజేశారు. ఆక్రమణల్లో పేదలు ఉంటే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. అప్పులు కడుతూనే అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్‌ని ప్రజలు కచ్చితంగా ఫాలో కావాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఫాలో అవ్వడం వల్ల ప్రమాదాలు తగ్గి ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడంతో ఫలితం లభిస్తుందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ నుంచి పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ తీసేసి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ని సీఎం తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అభివృద్ధి ఉరకలేస్తోందన్నారు. మంత్రి నారాయణ నెల్లూరువాసి కావటం మన అదృష్టమన్నారు. నిధుల కొరత ఉన్నా తనదైన శైలిలో నెల్లూరు సిటీ, రూరల్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు తదనంతరం నెల్లూరు రూరల్ టీడీపీ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి నారాయణ చొరవతో నెల్లూరులో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశారని, కార్పొరేషన్ పరిధిలో అవసరమైన అన్ని చోట్లా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కాబోతున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, టిడిపి ముఖ్య నేతలు, డివిజన్ ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కంచి స్వంతనిధులతో త్రాగునీటిబోరు ఏర్పాటు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మాడల్ ఎస్‌టి కాలనీలో ప్రజలదాహార్తిని తీర్చేందుకు నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిట బుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి స్వంత నిధులతో ఒక్క_ఆగునీటి బోరును వేయించి పంప్‌సెట్‌ను కూడా బిగింపజేశారు. ఆదివారం పర మేశ్వరరెడ్డి ఆ బోరును ప్రారంభించి కాలనీవాసులకు త్రాగునీటిని స్వయం గా అందజేశారు. గతంలో ఆయన దృష్టికి ఎస్‌టికాలనీలో త్రాగునీటి సమస్య గురించి అక్కడివారు తేగా ఆయన స్పందించి స్వంత నిధులతో బోరు వేయించి పంప్‌సెట్‌ను బిగించారు. ఆదివారం ఆయన పూజలు చేసి ఆ బోరును ప్రారంభించి కాలనీవాసులతో సంతోషంగా గడిపారు. కాలనీ వాసులు అత్యంత సంతోషం వ్యక్తం చేస్తూ కంచిపరమేశ్వరరెడ్డి సామాజిక సేవలను కొనియాడారు. గిరిజనులమైన తాము త్రాగునీటికి అవస్థలు పడుతుండగా స్వంత నిధులతో బోరు వేసి తమ దాహార్తిని తీర్చారని, ఆయన సేవలు తమలాంటి వారికి ఎంతో అండదండలని, తమలాంటి పేదలను ఆదుకుంటున్న పరమేశ్వరరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలని, ఆయన ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, తమలాంటి పేదలకు



నిరంతర సేవలందించాలని వారు ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, కాలనీకి చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకురాలు మల్లిక ఇందిర, మెప్మా ఆర్‌పి సుష్మ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ 2025 బీసీ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో మాగుంట లేఅవుట్ భువనేశ్ లైఫ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయ ప్రాంగణంలో మెగా డిఎస్సీ 2025 నందు ఎంపికయిన ఉపాధ్యాయులకు బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిం చారు. ముఖ్య అతిథిగా భువనేష్ లైఫ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కాకు బాబురావు, సిఈఓ ప్రవీణ్ కుమార్ లు హాజరయ్యారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిలి సురేష్, రాష్ట్ర కార్యదర్శి వేములపాటి మాధవ, జిల్లా అధ్యక్షులు తుమ్మ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు ఏపూరు ప్రభాకర్, ఆర్థిక కార్యదర్శి బాల రాగయ్య, ఇతర నాయకులు రాము, నరసింహరావు, రమణయ్య, నరసింహులు, పెంచలయ్య, మల్లె ప్రసాద్, జీవి రత్నం, రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగ ఉపాధ్యాయులు ఐక్యతకు కృషి చేయాలని, బీసీల రిజర్వేషన్ల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. మేమెంతో మాకంత రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల రిజర్వేషన్ శాతం పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 150మంది ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. బీసీల ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ సంఘాలతో కలసి పనిచేయాలని నూతన ఉపాధ్యాయులకు తెలియజేశారు.

# రౌడీషీటర్లకు, నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు, నేర చరిత్ర కలిగిన నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ ప్రజాశాంతికి భంగం కలిగిస్తే సహించేది లేదని.. ఎవరిని ఉపేక్షించమని.. పద్ధతులు మార్చుకొని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అంతేకాకుండా ప్రస్తుతం ప్రజలకు పలు హెల్ప్ లైన్లు అందుబాటులో ఉన్నాయని, రౌడీయిజం చేస్తే నిమిషాల్లోనే తమ దృష్టికి చేరుతుందని అందుకు తగ్గట్టుగానే పోలీసుల ప్రతి చర్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని పోలీస్ అధికారులు ఆయా పరిధిలోని స్టేషన్లలో రౌడీ షీటర్లకు జిల్లా ఎస్పీ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సాధించారని తెలియజేశారు. వాటిని అరికట్టే విధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని.. మహిళ, బాలికలపై, అత్యాచారాలకు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీ, కేడి, కదలికల పై పటిష్ఠ నిఘ ఉంటుందని, ప్రజాశాంతికి ఏమాత్రం భంగం కలిగిస్తే పీడీ యాక్ట్‌లు ఓపెన్ చేస్తామని అంతేకాకుండా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని వారిని హెచ్చరించారు. అదేవిధంగా నేరాలకు పాల్పడి జీవితాలు సర్వనాశనం చేసుకోవద్దని



తెలియజేశారు. ప్రతి నేరస్తుడిపై పటిష్ఠ నిఘా నిరంతరం ఉంటుందని నేర ప్రవర్తనను మానుకొని ప్రజలతో సహేతుకంగా మెలుగుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా జీవించాలని సూచించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. ఎవరైనా తమ ప్రాంతంలో ఏదైనా అల్లర్లు గొడవలు జరిగితే వెంటనే సదరు సమాచారాన్ని డయల్ 112కి గాని దగ్గరలోని పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

## పక్కా గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకోండి : మండల కన్వీనర్ తిరుమలరెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పక్కా గృహాల మంజూరుకు అర్హత కలిగిన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని జలదంకి మండలం టీడీపీ కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో, కూటమి ప్రభుత్వంలో వచ్చిన అవకాశాన్ని నాయకులంతా ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేయించాలన్నారు. మండల ప్రజలు కూడా ఆయా ప్రాంతాల నాయకుల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉంటుందని అర్హత కలిగిన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రెవిన్యూ కార్యాలయంలో సత్యసాయి జయంతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని మండల రెవిన్యూ కార్యాలయం (తహశిల్దారు ఆఫీస్)లో ఆదివారం శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యసాయిబాబా జీవిత విశేషాలను ఈసందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు ప్రతాప్, పేమల రవిబాబు, విఆర్ఏ ఇస్తర్ల మహేష్, కార్యాలయ సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ కార్యాలయంలో సత్యసాయి జయంతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు రవాణాశాఖ కార్యాలయంలో ఆదివారం శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలను మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. ప్రేమ, ఆధ్యాత్మిక సందేశాలతో ప్రజలను గెలిచిన మహిమాన్వితుడు సత్యసాయిబాబా అని రాములు పేర్కొన్నారు. ఆయన జయంతిని జరుపుకోవడం అత్యంత సంతోషదాయకంగా ఉందన్నారు. భగవత్ స్వరూపుడు సత్యసాయిబాబా అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ శివరామకృష్ణారెడ్డి..



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఉన్నందున రానున్న నాలుగైదు రోజులపాటు భారీ వర్ష సూచనల నేపథ్యంలో సోమశిల రిజర్వాయర్ నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేయడం జరుగుతుంది కాబట్టి పొదలకూరు మండలంలో పెన్నానది పరివాహక ప్రాంత గ్రామాలైన సూరాయపాలెం, విరువూరు, మహమ్మదా పురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి సూచించారు. సోమశిల రిజర్వాయర్ నుంచి 27,300 క్యూసెక్కుల నీటిని పెన్నానదికి విడుదల చేయడం జరిగిందని, రిజర్వాయర్‌కు వచ్చే ఇన్ ఫ్లోను బట్టి అది పెరగవచ్చన్నారు. కాబట్టి పెన్నానది పరివాహక గ్రామాలైన సూరాయపాలెం విరువూరు మహమ్మదాపురం గ్రామాలలోని పశువుల కాపర్లు రైతులు నది వైపు వెళ్లకుండా ఉండాలని తెలియజేశారు.

## గ్రంథాలయ పన్నులు వెంటనే జమ చేయాలి

**సామాజికవేత్త మాలకొండ రెడ్డి**



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లు పంచాయతీలు వసూలు చేసిన ఇంటి పన్నులు 8శాతం గ్రంథాలయ పన్నులు జిల్లా గ్రంథాలయ శాఖకు జమ చేయాలని లోక్సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 58వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా ఆర్‌సీ 30సీ/2007 ఉత్తర్వులు మేరకు డీసీబీ లెక్కల ప్రకారం పంచాయతీలు మున్సిపాలిటీలు వసూలు చేసిన ఇంటి పన్నులు 8శాతంను వెంటనే జమచేసి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రంథాలయాలు పరి పరిపుష్టి కావాలన్నా ప్రజలకు జ్ఞాన సంపదను అందించాలన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేసి ప్రభుత్వ భవనాలు లేని చోట ప్రభుత్వ స్థలాలు కేటాయించి నూతన భవనాలను నిర్మించాలని కోరారు. గ్రంథాలయ బకాయిలును స్థానిక సంస్థల నుండి వసూలు చేసి జిల్లా గ్రంథాలయానికి జమ చేసి వాటి అభివృద్ధికి కృషి చేయవలసినదిగా అధికారులను కోరారు.

# రాష్ట్రంలో ఆలయాల పరిరక్షణ తమ ప్రభుత్వ లక్ష్యం

- 40శాతం పెరిగిన ఆధ్యాత్మికత
- ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణకు ప్రాధాన్యం
- అభయాంజనేయస్వామి ఆలయాన్ని వృద్ధిచేస్తాం
- రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఆలయాల పరిరక్షణ తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆలయాల అభివృద్ధికి, నిర్మాణాలకు, పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆలయాల్లో నిత్యధూపధీపనైవేద్యాల ఏర్పాటుకు, అర్చకుల సంక్షేమానికి చర్యలు తీసుకున్నామని, తమ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో 40శాతం ఆధ్యాత్మికత పెరిగిందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి ఆలయ శాశ్వత ధర్మకర్తగా, కార్యనిర్వాహక చైర్మెన్‌గా నియమితులైన కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి రామనారాయణరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. తొలుత దేవాదాయశాఖ జిల్లా కమీషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి రవీంద్రారెడ్డిచేత ప్రమాణస్వీకారం చేయగా మంత్రి ఆనం నూతన చైర్మెన్‌ను అభినందించారు. అనంతరం మంత్రి రామనారాయణరెడ్డి ప్రసంగిస్తూ భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆధ్యాత్మిక ఉట్టిపడేలా రాష్ట్రంలో దేవాలయాల నిర్వహణ చేపడుతున్నామన్నారు. అభయాంజనేయస్వామి ఆలయ ధర్మకర్తగా నియమితులైన రవీంద్రారెడ్డి ఈ ఆలయం ఎంతో వైభవంగా వెలిగేలా కృషిచేయాలని, అభివృద్ధికి తాను సంపూర్ణ సహకారమందిస్తానని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కమతాలను గౌరవిస్తూ అందరినీ సమానంగా చూస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని ఆలయాల పరిరక్షణ, అభివృద్ధి, భక్తుల మనోభావాలకనుగుణంగా చేస్తున్నామని, చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరులో అనేక దేవాలయాలున్నాయని, ఆత్మకూరు ఆధ్యాత్మికకేంద్రంగా వెలుగొందాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తగా భాధ్యతలు అప్పగిస్తున్నామని, చిత్తశుద్ధితో పనిచేసి ఆలయాన్ని అభివృద్ధిపరచాలని, శ్రీఅభయాంజనేయస్వామి ఆశీస్సులు తనకు, ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నారాలోకేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ఉండాలని ఆయన కోరుకున్నారు. త్వరలోనే ఈ ఆలయానికి ఆరుమందితో కూడిన పాలకమండలిని నియమించాలని మంత్రి ఆనం దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి గుడిలో భగవంతుని ఆరాధన, ధూపధీపనైవేద్యాలకోసం 10వేల రూపాయల వంతున ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఆలయం ముంగిట ఉన్న బైపాస్‌రోడ్డును 100అడుగులతో నిర్మించి సెంట్రల్‌లైటింగ్, డివైడర్లు, వాకింగ్‌ట్రాక్స్ ఏర్పాటుకు నిధులు సాధించానని, పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చేయాల్సిన అభివృద్ధి ఇంకా చాలా ఉందని, అంచెలంచెలుగా చేస్తున్నామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరులో గతంలో ఎంతో ప్రాచీనచరిత్ర కలిగిన శ్రీదేవి, భూదేవిసమే శ్రీ అలఘునాధస్వామి ఆలయ పునరుద్ధరణకు తనవంతుగా సహకార మందించానన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, తెలుగుదేశం సీనియర్ నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్నా సంతోష్‌కుమార్, ఆత్మకూరు వ్యవసాయమార్కెట్‌కమిటీ చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, వైస్‌చైర్మెన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ సర్దార్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి, నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయభాస్కర్‌రెడ్డి, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, సొసైటీల అధ్యక్షులు కాటంరెడ్డి నారశింహారెడ్డి, పరిటాల సత్యనారాయణ, యర్రమల్ల చిన్నారెడ్డి, గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, ఆత్మకూరు పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, కార్పోరేషన్ డైరెక్టర్ అబ్బూరు రమేష్‌నాయుడు, వివిదస్థాయిల్లోని తెలుగుదేశం నాయకులు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, మద్దినేని నారాయణ, కొప్పోలు చిన్నపురెడ్డి, షేక్ జిలానిబాషా, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య, ఏలూరు మాల్యాద్రినాయుడు, నారాయణనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ గౌస్‌బాషా, మాదాల శ్రీనివాసులు నాయుడు, మొలబంటి రాజశేఖర్, మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, గంధళ్ళ వేణు, కొప్పోలు రమాదేవి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మండల పూజల మహాదీపారాధన



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలో వేంచేసియున్న వేద శాస్త్ర శ్రీ స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామికి కేరళ సాంప్రదాయంలో ఆదివారం ఉదయం మండల పూజలు జరిగాయి. తొలుత అయ్యప్పస్వామి వారి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, స్వామికి ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛ పూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తలపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం అయ్యప్ప స్వామివారి సేవలు కేరళ సాంప్రదాయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆడపాల శ్రీనివాసరెడ్డి రమమ్మ దంపతులు, పిడురు శ్రీనివాసులు రెడ్డి కవితమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అధ్యక్షులు గూడల శేషగిరిరావు కార్యదర్శి కత్తులవెంకటరత్నం కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో జరిగాయి కమిటీ సభ్యులు కత్తి మోహన్ రావు కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని విలుకాని పల్లె నుండి మహాలక్ష్మి పురం పలు కాలువల్లో గుర్రపు డెక్క ఆకు అధికంగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా దెబ్బతింది. ఇటీవలే కాలువలను శుభ్రం చేసినప్పటికీ, మళ్లీ ఆకు పేరుకుపోవడంతో దిగువ భాగాల రైతులకు నీరు చేరకపోవడం తీవ్ర ఇబ్బందులకు దారి తీస్తోంది. తంతరైతుల అభిప్రాయం ప్రకారం 'మొక్కజొన్న, వరి సాగుకు ఇది కీలక సమయం. నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు వెంటనే స్పందించి, కాలువల్లో పేరుకుపోయిన డెక్క ఆకును తొలగించాలి,' అని రైతులు విన్నవిస్తున్నారు. స్థానికులు ప్రభుత్వ ఇరిగేషన్ అధికారులను అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలువ శుభ్రత పనులకు ప్రత్యేక బృందాలను పంపించి, నీటి ప్రవాహం పునరుద్ధరించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య వెంటనే పరిష్కారం కాకపోతే పంట నష్టం తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు.

## చెరువును తలపిస్తున్న రాపూరు ప్రధాన విధులు

- చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్లపైనే వ్యర్థ పదార్థాలు
- రోడ్లపై వర్షపు నీరు, మురుగనీరు ప్రవాహం
- దుర్గంధభరితంగా రహదారులు
- నిత్యం ఆ రోడ్లపైనే తిరుగుతున్న అధికారులు, పాలకులు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** తపేరు గొప్ప ఊరి దిబ్బ అన్న సామెత రాపూరు పట్టణంకు కరెక్ట్ గా సరిపోతుంది. ప్రాంతం నుండి ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అనేకమంది ఎన్నికయ్యారు. కానీ రాపూరు ప్రాంతం ఎప్పటికీ పూర్ గానే నిలిచిపోయింది. ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన రాపూర్ పట్టణం నేడు చిన్నపాటి వర్షానికి అన్ని ప్రధాన రహదారులు చెరువును తలపించే విధంగా మారుతున్నాయి. ఆదివారం కురిసిన చిన్న పాట్టీ జల్లులకు రోడ్డు అన్ని జలమయం అయినాయి. మురుగు నీరంతా రోడ్లపైనే ప్రవహించడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. నిత్యం అనేకమంది సంచారం సాగించే రోడ్లపై మురుగునీరు, వ్యర్థ పదార్థాలు కలిసి పారుతూ దుర్గంధ భరితమైన దుర్వాసన వెదజల్లుతుంది. రహదారుల వెంబడి ఉన్న కొన్ని గృహాల్లో కూడా ఈ మురుగునీరు వ్యర్థ పదార్థాలు వెళ్లి గృహవాసులు అనేకమైన ఇబ్బందులు పడుతున్నారు. రాపూరు పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం మురుగునీరు రోడ్లపై రావడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మురుగు నీరు, వర్షపు నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ కాలువలు లేకపోవడంతోనే ఇటువంటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. కానీ నిత్యం ఇదే రోడ్లపై నడుస్తున్న అనేకమంది పాలకులు, అధికారులు చూస్తూనే ఉన్నారు కానీ మంచి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావాలని ఆలోచన వారికి రాకపోవడం విశేషం. చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయం కావడంతోపాటుగా పెద్ద జల్లులతో కూడిన వర్షం వస్తే అంతేసంగతి అన్ని గృహాల్లోకి నేరుగా మురుగునీరు-వ్యర్థ పదార్థాలు వెళ్లిపోవడం కళ్ళముందే కనిపిస్తున్న దృశ్యాలు అనేకం ఉన్నాయి. రాపూర్ పట్టణంలో అన్ని ప్రాంతాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడానికి మరో కారణం. పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ రహదారులను కుప్ప తొట్లుగా మారుస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ అధికారులు, పాలకులు కలిసికట్టుగా ముందుకు వచ్చి రాపూరు పట్టణంలో మంచి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థతోపాటుగా మురుగునీరు రోడ్ల పైన పారకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మంత్రి నారాయణ చొరవతో నెరవేరనున్న

## నెల్లూరు వాసుల చిరకాల స్వప్నం

- నెల్లూరులో ఆధునిక హంగులతో నిర్మితం కాబోతున్న నూతన మార్కెట్ యార్డ్ సముదాయం
- నెల్లూరు - నరుకూరు రోడ్డులో స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- బ్లూ ప్రింట్ ద్వారా మార్కెట్ యార్డ్ నమూనాను పరిశీలించి అధికారులకు దిశ నిర్దేశం చేసిన మంత్రి
- దేశంలోనే మొట్టమొదటిసారిగా నెల్లూరులో ఆధునిక టెక్నాలజీతో మార్కెట్ యార్డ్ ను నిర్మించబోతున్నట్లు స్పష్టం చేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర వాసుల చిరకాల స్వప్నం నెరవేర్చేల రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వ్యూహాత్మకంగా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో దేశంలోనే మొట్టమొదటి సారిగా మరెక్కడ లేనివిధంగా అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన మార్కెట్ యార్డ్ ను నెల్లూరులో నిర్మించేందుకు వ్యూహరచన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం నెల్లూరు నరుకూరు రోడ్డులో ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్న మార్కెట్ యార్డ్‌కి సంబంధించిన స్థలాన్ని మంత్రి నారాయణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ నమూనాను బ్లూ ప్రింట్ ద్వారా అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అత్యాధునిక వసతులతో కూడిన మార్కెట్ యార్డ్‌ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులని మంత్రి ఆదేశించారు. యార్డులో అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ మార్కెట్ యార్డ్‌లో ప్రజలకు అవసరమైన అన్ని వస్తు సామాగ్రి ఒకే చోట లభ్యమయ్యేలా రూపొందించినట్లు మంత్రి స్పష్టం చేశారు. అందుకు తగినట్లు రూపకల్పన చేయాలంటూ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. తద్వారా దేశంలోనే మరెక్కడా లేని విధంగా మొట్టమొదటిసారిగా నెల్లూరులో మార్కెట్ యార్డ్ రూపుదిద్దుకోబోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జియం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.